బడిలో మోగిన ఎన్నికల గంట

- నేడే పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు



రాయదుర్గంలోని కళ్లే మఠం పురపాలక ఉన్నత పాఠశాల

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం తొమ్మిది గంటలకే ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. అంతకు ముందు ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

777 పాఠశాలల్లో ఎన్నికలు..

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల సందర్భంగా ఒకటి నుంచి పది వరకు ప్రతి తరగతిలోనూ ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ రిజర్వేషన్ల అమలుతో పాటు కచ్చితంగా ఇద్దరు మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తారు. ప్రాథమిక 15, ప్రాథమికోన్నత 21, ఉన్నత పాఠశాలల్లో 15 మంది కమిటీ సభ్యులు ఉంటారు. మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఎన్నికను పూర్తిచేసి రెండు తర్వాత చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎంపిక చేపడతారు. పోటీ పెరిగితే చేతులు ఎత్తే విధానం అమలుచేస్తారు. అప్పటికి కొలిక్కి రాకపోతే ఓటింగ్ నిర్వహించి వెంటనే ఫలితాలు వెల్లడిస్తారు. ఆ తర్వాత చైర్మెన్, వైస్ చైర్మెన్, సభ్యులతో తొలి సమావేశం నిర్వహిస్తారు. వీరి పదవి కాలం రెండేళ్లపాటు ఉంటుంది. ఎన్నుకోబడిన వారు పాఠశాల అభివృద్ధి నిర్వహణ, విద్యాప్రమాణాలు, నగదు లావాదేవీలు చూసే బాధ్యతలో కీలక భూమిక పోషిస్తారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మొత్తం 777 పాఠశాలలు ఉండగా 1,18,530 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం 777 పాఠశాలల్లోనూ మేనేజ్‌మెంట్ కమిటీలు ఎంపిక చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు	కమిటీలు
రాయదుర్గం	285	48,195	285
కళ్యాణదుర్గం	269	35,535	269
ఉరవకొండ	223	34,800	223

ఎక్స్ అఫిషియో సభ్యులు..

పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యులతో పాటు ఆ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం, మున్సిపాల్టీలో అయితే కౌన్సిలర్, గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుడు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు.

విలువలు పెంచిన మాజీ సీఎం జగన్..

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మెంబర్లకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువలు పెంచి గౌరవించారు. నాడు-నేడు పథకం అమల్లోకి తీసుకొచ్చి పాఠశాలల రూపురేఖలు మార్చేలా కృషి చేశారు. ఏ బడి చూసిన కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దారు. ఆ నిర్మాణ బాధ్యతలన్నీ కాంట్రాక్టర్లకు కాకుండా స్కూల్ కమిటీలకే అప్పగించారు. వారి పర్యవేక్షణలోనే పూర్తిచేయించారు. మధ్యాహ్న భోజనం మొదలు పాఠశాలలో జరిగే అన్నీ కార్యక్రమాలకు చైర్మెన్‌ను సుప్రీంగా చూశారు. దీంతో ఆ పదవికి ఒక్కసారిగా విలువ పెరిగింది.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి: ఆర్డీఓ, డీఎస్పీ

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎంఈఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐలకు కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎస్పీ బీ శ్రీనివాసులు సూచించారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలు ఎంఈఓ, హెచ్‌ఎంలు, లా అండ్ ఆర్డర్ అంశాలను పోలీస్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చట్టాన్ని చేతుల్లో తీసుకునేలా వ్యవహరిస్తే ఉక్కుపాదం మోపాలన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఎస్ఎంసీ ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం. గురువారం పాఠశాలల్లో జరిగే ఎస్ఎంసీ ఎన్నికలకు విద్యార్థి తల్లిదండ్రులు హాజరై కమిటీలను ఎన్నుకోవాలి.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

క్లుప్తంగా

కళ్యాణదుర్గం తహసీల్దార్‌గా భాస్కర్



కళ్యాణదుర్గం రూరల్: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సుభాకర్‌రావు బదిలీపై నంద్యాలకు వెళ్లారు. ఈసందర్భంగా నూతన తహసీల్దార్ భాస్కర్‌కు రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు సమస్యలపై నేరుగా తనను కలవొచ్చని, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాలకిషన్

కంబదూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్‌గా బాలకిషన్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్లు నారాయణస్వామి, గణేష్, ఆర్‌ఐ కిరణ్‌కుమార్, వీఆర్వోలు సంజీవ్‌కుమార్, ఫక్కీరప్ప, సూర్యనారాయణ, మధు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

తహసీల్దార్‌గా సాకే శ్రీనివాసులు

గుమ్మఘట్ట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నూతన తహసీల్దార్‌గా సాకే శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా రామసాగరం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో నుండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌గా నారాయణస్వామి



కళ్యాణదుర్గం రూరల్: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన సబ్ రిజిస్ట్రార్‌గా నారాయణస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ బదిలీపై వెళ్లారు. అనంతపురంలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న నారాయణస్వామి ఇక్కడికి వచ్చారు. నూతన సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

బొమ్మనహాళ్ ఏపీఓగా భాగ్యలక్ష్మి




బొమ్మనహాళ్: మండలం ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఓగా భాగ్యలక్ష్మి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పుట్లూరు మండలం నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. రైతులకు అవసరమయ్యే పనులు తమ దృష్టికి తీసుకువస్తే చేయిస్తామన్నారు.

వర్షం కురవాలని సప్తభజన


సప్తభజన చేస్తున్న రైతులు

వజ్రకరూరు: తట్రకల్లు గ్రామంలోని శివాలయంలో బుధవారం వర్షం కురవాలని రైతులు సప్తభజన ప్రారంభించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సప్తభజన ప్రారంభించారు. వర్షాభావం కారణంగా సాగుచేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరుణుడు కరుణించాలని భజనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పశువులకు బ్రూసెల్లోసిస్ టీకాలు


పెయ్య దూడలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రమేష్

బెళుగుప్ప: పశుపోషకులు పెయ్య దూడలకు తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ నివారణకు టీకాలు వేయించాలని బెళుగుప్ప పశువైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గుండ్లపల్లి, ఆవులెన్న, బూదివర్తి, బెళుగుప్ప గ్రామాల్లోని సుమారు 59 పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేశారు. పెయ్య దూడలకు నాలుగు నెలల వయస్సు నుంచి ఎనిమిది నెలల వయస్సులోపు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలని తెలిపారు.

సజావుగా మండల మీట్


మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ లీలావతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఎంపీటీసీ, సర్పంచులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల కోసం ప్రజాప్రతినిధులందరూ కలిసి పని చేసి మెరుగైన పాలన అందిద్దామన్నారు. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15 ఫైనాన్స్ నిధులు ప్రజల అవసరాలు, గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పన కోసం వెచ్చించి అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. పలువురు సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకోరాగా వివిధశాఖల అధికారులు తమ శాఖపరిధిలో జరిగే పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డి.పద్మావతి, తహశీల్దార్ ఈ.ఫణీకుమార్, ఎంపీడీఓ గూడెన్న, వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్, డాక్టర్లు చంద్రమనోహర్, విజయ్‌కుమార్, ఎంఈఓలు లక్ష్మన్న, భవానీశంకర్, కణేకల్లు మేజర్‌గ్రామ పంచాయితీ సర్పంచు నిర్మల, ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి శోచనీయం


ఉపసర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఉపసర్పంచ్ బోయ నాగమ్మ, అతడి భర్త బోయ హనుమంతుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న ఓబుళప్ప కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ పాలడగు వంశీతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలకు ఇప్పటికైనా టీడీపీ నేతలు స్వస్తి పలకాలన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి గ్రామంలో అందరు కలిసి మెలసి ఉండాలన్నారు. లత్తవరం గ్రామ అభివృద్ధికి టీడీపీ నాయకులు దృష్టి పెట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తు దాడులు చేయడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష


మహిళలకు సీమంతం చేస్తున్న ఆర్‌డీఓ రాణి సుస్మిత, సీడీపీఓ లక్ష్మీప్రసన్న


ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


ఉద్దేహాళ్‌లో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఆర్‌డీఓ రాణి సుస్మిత, సీడీపీఓ లక్ష్మిప్రసన్న పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపే ముర్రపాలు పట్టించాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యాక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టూరు: పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగాల బారి నుంచి వారిని కాపాడొచ్చని సీడీపీఓ వనజ అక్కమ్మ పేర్కొన్నారు. బుధవారం చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పిల్లలకు అన్న ప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త వన్నూరక్క పాల్గొన్నారు.

ఉరవకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.విజయకుమారి తెలిపారు. బుధవారం పట్టణంలోని పాతగాంధీ బజారు వద్ద ఉన్న 25వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త నయీమ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శమంతక మణి తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. బుధవారం కొనకొండ్లలోని 3, 6 7 అంగన్‌వాడీ కేంద్రాల పరధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్‌ఎంలు పద్మావతి, ఉషామౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

బొమ్మనహాళ్: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని బొమ్మనహాళ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలు లేకుండానే ప్రజా వేదిక

- అవకతవకలను చెప్పకుండానే వెళ్లిపోయిన అధికారులు


బొమ్మనహాళ్‌లో ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజలు లేకుండా ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఒక్కరంటే ఒక్కరు కూడా సాధారణ ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. సమావేశంలో ఏర్పాటు చేసిన కుర్చీల్లో కేవలం మండలంలో పనిచేస్తున్న ఉపాధి సిబ్బంది మాత్రమే కూర్చున్నారు. వారి సమక్షంలోనే అధికారులు రికార్డుల తనిఖీ చేసి సిబ్బంది నివేదిక పరిశీలన పూర్తి చేసి సామాజిక తనిఖీ ప్రక్రియను మమా అనిపించారు. గత నెల 26వ తేదీ నుంచి సామాజికి తనిఖీ బృందం మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ జరిగిన 904 పనులు రూ.8.14 కోట్ల వ్యయంతో జరిగాయి. అందులో జరిగిన అవకతవకలను వెల్లడించాల్సి ఉన్నా బుధవారం జరిగిన ప్రజావేదికలో అధికారులు వివరాలను బయట పెట్టకుండా గోప్యంగా రికార్డులను పరిశీలించి వెళ్లిపోయారు. ప్రజా వేదిక ప్రొసీడింగ్ అధికారి, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, డీవీఓ పర్వాజ్ సమక్షంలో ప్రజా వేదిక నిర్వహించారు. అయితే వివరాలను మీడియాకు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నేతన్నల హక్కుల సాధనే ధ్యేయం



జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్న చేనేత కార్మికులు, కేక్ కట్ చేస్తున్న చేనేత నాయకులు

రాయదుర్గంటౌన్: దేశంలో వ్యవసాయ రంగం తరువాత రెండో స్థానంలో ఉన్న చేనేత రంగం అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం విస్మరించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఏపీ చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు మధు విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని నేసేపేటలో చేనేత కార్మికులతో కలిసి కేక్‌కట్ చేసి చేనేతలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ సర్కారు అధికారంలోకి రాగానే చేనేత రంగానికి కేటాయించిన 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహించిందన్నారు. అంతేకాకుండా చేనేత కార్మికులు పోరాడి సాధించుకున్న జాతీయ చేనేత బోర్డును రద్దు చేయడం దారుణమన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు రంగస్వామి, హనుమంతు, ప్రకాష్, అశోక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఉరవకొండ: స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరీ చైర్మన్ కార్యాలయంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత యువనాయకుడు, ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయ చైర్మన్ కొత్త శరత్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కొత్త శరత్ మాట్లాడుతూ.. వ్యవసాయం తరువాత అత్యధిక మంది ఆధారపడి జీవిస్తున్న చేనేత వృత్తి గొప్పదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల అభ్యున్నతికి మరింత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఉట్టి నారాయణ స్వామి, నిమ్మల ప్రసాద్, ముక్కర బాల, చెంగల నాగరాజు, చిట్టా రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం


మాట్లాడుతున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

శెట్టూరు: బాల్య వివాహాలు అనర్థదాయకమని సీడీపీఓ వనజ అక్కమ్మ అన్నారు. బుధవారం చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలో 'బాల్య వివాహాలు అరికడదాం-ఆడబిడ్డలను కాపాడుదాం' అనే అంశంపై ఆర్డీటీ, ఐసీడీఎస్‌తో సంయుక్తంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఆడపిల్లలంటే పెళ్ళిచేసి భారం తగ్గించుకుందామనే ఆలోచన తల్లిదండ్రులు విడనాడాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఎంఈఓ శ్రీధర్, సూపర్‌వైజర్ రాధమ్మ, ప్రధానోపాధ్యాయురాలు శిరిషా లక్ష్మి, వైద్య సిబ్బంది సరోజ, అంజలి, జాన్సన్, మహిళా పోలీసు శిరీష, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 తర్వాత వేరుశనగ, ఆముదం విత్తొద్దు

కూడేరు: ఖరీఫ్‌లో వర్షాధారం కింద ఈనెల 15 తర్వాత వేరుశనగ, ఆముదం సాగు చేయొద్దని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. విత్తు అదును సమయంలో వరుణుడు మొహం చాటేయడంతో పదునైన వర్షం కురవలేదు. అరకొర తేమకు వేరుశనగ సుమారు 5 వేల ఎకరాల్లో, ఆముదం సుమారు 1000 ఎకరాల్లో, కంది 1000 ఎకరాల్లో సాగైంది. జూలై నెలలో కూడా ఆశించిన వర్షాలు కురవలేదు. ఇప్పుడు వేరుశనగ, ఆముదం సాగు చేస్తే దిగుబడి ఉండదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఆలస్యంగా వర్షాలు కురిస్తే ఉలువ, జొన్న, కొర్ర వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా శేషవాహన సేవ


శేషవాహనంపై విహరిస్తున్న కాళికాదేవి సమేత వీరభద్రుడు

విడపనకల్లు: మండల పరిధిలోని ఉండబండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై వీరభద్రస్వామి, కాళికా దేవిని ఊరేగించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నిరంతరాయంగా నీటి పంపింగ్


ఎస్ఎస్ ట్యాంకులో నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయదుర్గంటౌన్: హెచ్చెల్సీ కెనాల్ నుంచి కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నిరంతరాయంగా నీటి పంపింగ్ జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈ సురేష్ తెలిపారు. రాయదుర్గం పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం కింద కణేకల్లులో గల ఎస్ఎస్ ట్యాంకుకు తుంగభద్ర జలాల పంపింగ్‌ను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్చెల్సీ కెనాల్‌లో నీరు నిల్వ ఉన్నంత కాలం నీటి పంపింగ్ జరుగుతుందని, పట్టణ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏడాది కాలానికి సరిపడ నీరు నిల్వ చేసుకుంటామన్నారు.

94 శాతం పూర్తయిన ఓడీఎఫ్ సర్వే

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఓడీఎఫ్ సర్వే 94 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ గౌరిదేవి తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా? లేదా? ఎంతమందికి అవసరం ఉందని ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మరో నాలుగు రోజుల్లో సర్వేను పూర్తి చేస్తామన్నారు.

ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన పంట రైతులు ఈ-కాప్ తప్పనిసరిగా చేయించాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలియజేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాప్ చేయించుకుంటేనే ఉద్యాన రైతులకు ప్రభుత్వం నుంచి పంట నష్టపోయిన సమయంలో పరిహారం అందుతుందన్నారు. ఏడీఏ ఎల్లప్ప, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'చర్చించకుండా నిర్ణయం తీసుకోవడం సరికాదు'

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధ్యాయుల సంఘాలతో చర్చించకుండా జీఓ 117 మేరకు టీచర్లను సర్దుబాటు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ గొని పాతరెడ్డి తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచిన హామీ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117 రద్దు చేసి టీడీపీ ఇచ్చిన హామీ నిలుపుకోవాలన్నారు. జీఓ 117 మేరకు టీచర్ల సర్దుబాటు చేస్తే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు పొందే అవకాశం ఉండదని మండిపడ్డారు. జీవో 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం


వీణ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: మల్లాపురం గ్రామానికి చెందిన వెంకటేశులు కుమార్తె వీణ అదృశ్యమైంది. వివరాలు.. వెంకటేశులుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె వీణా మతిస్థిమితం లేదు. బుధవారం ఉదయం నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

బాలుడికి పాముకాటు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని బలిజ వీధిలో మంగళవారం రాత్రి బెస్త రోహిత్ అనే బాలుడు పాముకాటుకు గురయ్యాడు. బాలుడు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్సల నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సల నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20న ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ లలిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.